సాక్షి విశాఖపట్నం

బుధవారం। 28। జూన్। 2023



ఆశాజనకంగా మత్స్యవేట

సముద్రంలో మత్స్య వేట ఆశాజనకంగా సాగుతోంది. కొమ్ముకోనం, టూనాతో పాటు రొయ్యలు వలకు చిక్కుతున్నాయి. IIలో



జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక

రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేశారు. IIలో



చేనేత కళాకారులకు చేయూత

చేతి వృత్తి, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలని నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్ కోరారు. IIలో

న్యూస్‌రీల్

నేటి నుంచి తుది విడత చందనం అరగదీత



చందనం చెక్కలను కోస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం నుంచి తుది విడత చందనం అరగదీత ప్రారంభం కానుంది. వచ్చే నెల 3న ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చి చందనాన్ని (125 కిలోలు) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమం చేపట్టనున్నారు. మంగళవారం చందనం చెక్కలను ముక్కలు కోశారు. కాగా ఏడాదిలో స్వామికి నాలుగు విడతలుగా మూడేసి మణుగుల(125కిలోల చొప్పున) పచ్చి చందనాన్ని సమర్పిస్తుంటారు. గత చందనోత్సవం రోజు రాత్రి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి రోజుల్లో చందనం సమర్పణ చేశారు. తుది విడత వచ్చేనెల 3న ఆషాఢ పౌర్ణమి రోజు స్వామికి చందన సమర్పణ చేస్తారు.

రామావతారంలో జగన్నాథుడు



దాబాగార్డెన్స్ : జగన్నాథుడి రథోత్సవాల్లో భాగంగా టర్నరు చౌల్ట్రీ వద్ద కొలువుదీరిన స్వామి మంగళవారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున 5 గంటలకు ప్రత్యేక పూజలు, పారాయణాలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వపంతి మాతృమండలిచే విష్ణు సహస్రనామ పారాయణ, గోవిందనామ సంకీర్తన, హనుమాన్ చాలీసా నిర్వహించారు. అనంతరం రామకృష్ణానగర్, సంగీత జన కులం భజనమండలి ఆకొండి వెంకట్రావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహించిన సుందర కాండ, రామనామ గానామృతం ఆకట్టుకుంది. బుధవారం స్వామి బలరామ, శ్రీకృష్ణావతారంలో దర్శనమివ్వనున్నారు.

అప్పన్నను దర్శించుకున్న క్రికెటర్ భరత్ దంపతులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న భరత్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం భారత క్రికెటర్ కె.ఎస్. భరత్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

ఏప్రిల్ 1 నుంచి జీతాలు పెంచుతాం

గంగవరం పోర్టు యాజమాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: గంగవరం పోర్టు కార్మికులకు జీతాల పెంపుపై మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. కలెక్టర్ ఎ.మల్లికార్జున అధ్యక్షతన జరిగిన సమావేశంలో గంగవరం పోర్టు సీఈవో బి.జి. గాంధీ, సీనియర్ కన్సల్టెంట్ నండూరి సాంబశివరావు, హెచ్ఆర్ హెడ్ సి.ఎస్.రాజు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీసీపీ-1 ఆనందరెడ్డి, స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారి రామ్మోహనరావు, 20 మంది పోర్టు కార్మికులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. పోర్టు కార్మికుల సమస్యలపై చర్చించారు. తమకు జీతాలు పెంచాలని కార్మికులు కోరగా.. వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంచుతామని పోర్టు యాజమాన్యం తెలిపింది.

1న హైకోర్టు జడ్జి రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రరాయ్ జూలై ఒకటో తేదీన విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఆరోజు మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళతారు. అక్కడ కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం స్థానికంగా జరిగే ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. జూలై 2న మధ్యాహ్నం 4.35 గంటలకు ఇండిగో విమానంలో విజయవాడ బయలుదేరుతారు.

అమ్మ ఒడికి చేరే వేళ..!

- అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న అమ్మ ఒడి
- నేడు తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ
- నాలుగో ఏడాది వరుసగా ఆర్థిక సాయం
- జిల్లాలో 1,70,647 మందికి రూ.255.70 కోట్లు మంజూరు



విశాఖ విద్య : పేదల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత అమ్మఒడి నిధుల విడుదలకు రంగం సిద్ధం చేసింది. బుధవారం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. గతంలో అనేకమంది పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ పిల్లలను బడికి పంపేవారుకాదు. బడికి ఫీజులు, పుస్తకాలు, ఇతర వస్తువులకు పెద్ద మొత్తం ఖర్చుచేయాలని భయపడేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో నిరుపేదల సమస్యలను ప్రత్యక్షంగా చూసి తన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి విద్యార్థి లేదు చదువుకోవాలనే ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. చదువుకు పేదరికం అడ్డుకారాదంటూ జగన్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతోమంది కుటుంబాల్లో వెలుగులు నింపింది.

జిల్లాకు రూ.255.70 కోట్లు మంజూరు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 1,70,467 మందికి రూ. 255.70 కోట్లు మంజూరయ్యాయి. అర్హులైన ఏ ఒక్క విద్యార్థికి పథకం అందలేదనే మాట రాకుండా పకడ్బందీగా అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పార్వతీపురం మన్యం జిల్లాలో 'జగనన్న అమ్మ ఒడి పథకం' ప్రారంభించిన మరుక్షణమే, విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకానున్నాయి. పారిశుధ్య నిర్వహణలో భాగంగా బడిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం పేరిట రూ. 2 వేలు మినహాయించి, మిగతా రూ. 13 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తారు.

అమ్మ ఒడికి అర్హతే ప్రామాణికం

విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించాలనే ఉన్నతాశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే కొంతమంది అనర్హులకు డబ్బులు అందుతున్నాయనే ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జాబితాపై సమగ్ర పరిశీలన జరుగుతోంది. వెబ్‌సైట్‌లో ఉన్న జాబితా మేరకు సచివాలయ విద్యాకార్యదర్శి, వలంటీర్ నేతృత్వంలో లబ్ధిదారుల బయోమెట్రిక్ అథంటికేషన్ (ఈకేవైసీ) తీసుకుంటున్నారు. ఆధార్ కార్డు వేర్వేరు బ్యాంకు అకౌంట్లతో అనుసంధానమై ఉంటే, సాంకేతిక సమస్యల తలెత్తి డబ్బులు జమ కావు. ఈ కారణాల వల్లనే గతంలో అర్హులైనప్పటికీ కొంతమందికి డబ్బులు అందలేదు. ఇలాంటి సమస్యలను సచివాలయ స్థాయిలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

జిల్లాలో అమ్మఒడి లబ్ధిదారులు, మంజూరైన నిధులు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,95,442	290.16
2020-21	2,02,042	303.06
2021-22	1,75,065	262.60
2022-23	1,70,467	255.70

అర్హులందరికీ అమ్మ ఒడి



అర్హులైన విద్యార్థులందరికీ అమ్మ ఒడి పథకం డబ్బులు అందేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. అర్హులైన విద్యార్థులు పేర్లు జాబితాలో లేనట్‌లైతే సచివాలయ విద్యా కార్యదర్శి, లేదా వలంటీర్‌ను సంప్రదించాలి. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలి.

– ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

దర్జాగా చదివించుకుంటున్నాం



కాలనీలో ఇస్త్రీ బండిపై వచ్చే ఆదాయమే మా కుటుంబానికి జీవనాధారం. అమ్మ ఒడి పథకం మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మా పాప జ్యోత్స్న అక్కయ్యపాలెం మున్సిపల్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతుంది. మాకు మూడు సంవత్సరాలు డబ్బులు వచ్చాయి. ఈ సారి డబ్బులు పడతాయని మా వలంటీర్ చెప్పాడు. పిల్లలను దర్జాగా చదివించుకుంటున్నాం.

– బంగారి లక్ష్మి, అక్కయ్యపాలెం, విశాఖపట్నం

మాలాంటోళ్లకు భరోసా



మా పిల్లలను బాగా చదివించుకోవాలనే కోరిక. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉంటున్నాను. మా ఆయన పనులకు వెళ్తాడు. జగనన్న ఇస్తున్న అమ్మ ఒడి డబ్బులు మాలాంటోళ్లకు భరోసాగా నిలుస్తున్నాయి. మూడేళ్ల పాటు డబ్బులు అందాయి. పిల్లల అవసరాలకు ఎంతో ఉపయోగపడ్డాయి. చాలా సంతోషంగా ఉంది.

– వెంపటాపు లక్ష్మి, అబిత్‌నగర్, విశాఖపట్నం

మన వైద్య విధానం దేశానికే ఆదర్శం



వడ్లపూడి కణితి పీహెచ్‌సీ వద్ద ప్రారంభోత్సవ శిలాఫలకం వద్ద పూజలు చేస్తున్న మంత్రి విడదల రజిని

- సీఎం జగన్ హయాంలో ఆస్పత్రుల స్వరూపమే మారిపోయింది
- ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో అమలు చేస్తున్న వైద్య విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామస్థాయి నుంచి టీచింగ్ స్థాయి వరకు అన్ని ఆస్పత్రులను అద్భుతంగా తీర్చి దిద్దారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని అన్నారు. రూ.1.75 కోట్లతో నిర్మించిన వడ్లపూడి కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపరచాలనే ఆలోచన కూడా చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులు కొత్త శోభను సంతరించుకున్నాయని చెప్పారు. ఆస్పత్రుల్లో ఇకపై ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారని తెలిపారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అటెండర్లు కాకుండా మొత్తం 14 మంది వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలందిస్తారన్నారు. పీహెచ్‌సీలో ఇకపై 215 రకాల మందులు, 65 రకాల వైద్య పరీక్షలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, వైద్యులు డాక్టర్ శివయ్య, స్వరూపారాణి, వైఎస్సార్ సీపీ గాజువాక కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, 87వ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ఎన్నేటి రమణ, చుప్పా నాగరాజు, బలిరెడ్డి నాగేశ్వరరావు, చిత్రాడ వెంకట రమణ, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, నమ్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసియా క్రీడలకు సాయిసంహిత



విశాఖ స్పోర్ట్స్: 19వ ఆసియా క్రీడలకు విశాఖ స్కేటర్ ఎ.సాయిసంహిత అర్హత సాధించింది. చైనాలో సెప్టెంబర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు భారత్ రోలర్ స్కేటింగ్ సమాఖ్య ఆర్టిస్టిక్ విభాగంలో సాయి సంహిత ఎంపికైందని ప్రకటించింది. జాతీయ చాంపియన్‌షిప్‌ల్లో పలుమార్లు ఆర్టిస్టిక్ అంశాల్లో సత్తా చాటిన సాయిసంహిత ప్రస్తుతం మొహాలిలో జరుగుతున్న జాతీయ శిబిరంలో తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఈ శిబిరం 10 రోజుల పాటు జరగనుంది.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల పరిశీలన

కొత్త ఘాట్‌రోడ్డు ముఖద్వారం వద్ద కూడా కొబ్బరి కాయలు కొట్టేందుకు ఏర్పాట్లు



మాధవధార వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: వచ్చే నెల 2న జరిగే గిరి ప్రదక్షిణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో వి.త్రినాథరావు పరిశీలించారు. గిరి ప్రదక్షిణ మార్గంలో పర్యటించారు. ప్రదక్షిణ ప్రారంభమయ్యే కొండ దిగువ తొలిపావంచా వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాటు చేస్తున్న ర్యాంపులను పరిశీలించారు.

మాధవధార, లుంబినీ పార్కు ప్రాంతాలను పరిశీలించి అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్, పోలీస్ కమిషనర్ సూచనల మేరకు పాత అడవివరం జంక్షన్‌కు సమీపంలోని కొత్తఘాట్ ముఖద్వారం వద్ద కూడా భక్తులు కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హనుమంతవాక నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డులో వచ్చే భక్తులందరికీ ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కొత్త ఘాట్ రోడ్డు ముఖ ద్వారం వద్ద స్వామి నమూనా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి పావంచా వద్ద, కొత్తఘాట్ రోడ్డు ముఖద్వారం వద్ద కలిపి మొత్తం 100కి పైగా ర్యాంపులు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టే భక్తుల మధ్య తోపులాటలు లేకుండా తొలి పావంచా వద్ద 20కిపైగా క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. పర్యటనలో ట్రస్ట్ బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీదేవి, వారణాసి దినేష్‌రాజ్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ వరహాలరావు, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబు హామీలు నెరవేరుస్తారని చెప్పండి!

- విశ్వసనీయత కోసం టీడీపీ నేతల అగచాట్లు
- గాజువాక సభలో వేడుకోలు



యాత్రలో పాల్గొన్న టీడీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబు ఇస్తున్న హామీలు నెరవేరుస్తారని ప్రజలకు గట్టిగా చెప్పాలని ఆ పార్టీ నేతలు కార్యకర్తలను వేడుకుంటున్నారు. ఇన్నాళ్లూ చంద్రబాబు ఇచ్చిన హామీల అమలులో ప్రజల్లో నమ్మకం సడలిన నేపథ్యంలో ఇప్పుడు వీరు విశ్వసనీయత కోసం తంటాలు పడుతున్నారు. విశ్వసనీయతకు మారుపేరుతో, మాట తప్పని నైజం కలిగిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు టీడీపీ నాయకులు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేస్తారన్న నమ్మకం కలిగించడానికి బస్సు చైతన్య రథయాత్ర ద్వారా ప్రయత్నిస్తున్నారు. పాతగాజువాకలో మంగళవారం నిర్వహించిన సభలో ప్రసంగించిన నేతలు ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావించారు. సభలో మాట్లాడిన మాజీ మంత్రి, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంక్షేమ పథకాలకు టీడీపీ వ్యతిరేకం కాదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాలకంటే మరింత మెరుగైనవి ఇస్తామని ప్రజలకు చెప్పమన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఇక టీడీపీ పనైపోయిందనుకుంటున్న తరుణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు మళ్లీ జీవం పోశాయంటూ రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని తేటతెల్లం చేశారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టో ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా దసరాకు విడుదలవుతుందని చెప్పుకున్నారు. టీడీపీ మేనిఫెస్టో వైఎస్సార్‌సీపీని కాపీ కొట్టినట్టుందంటూ వస్తున్న వాదనల నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖను కార్యనిర్వాహక రాజధానిని చేస్తామన్న ప్రకటనను స్థానికులుగా తాము స్వాగతించామని టీడీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తన ప్రసంగంలో పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సభలో ఎమ్మెల్సీలు వి.చిరంజీవిరావు, డి.రామారావు, జగదీష్, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పీలా గోవిందు, కె.లలితకుమారి, శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కూన రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు గలీజు మాటలు!

తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్న టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. గాజువాకలో నిర్వహించిన బహిరంగ సభలోనూ ఆ పార్టీ నేతలు గలీజు మాటలే మాట్లాడారు. తమ బస్సు యాత్ర లక్ష్యాన్ని వివరించడంకంటే సీఎం జగన్‌పై వ్యక్తిగత దూషణలకే అధిక ప్రాధాన్యమిచ్చారు. విజ్ఞత, సంస్కారాన్ని మరచి ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిని వాడు, వీడు అంటూ పరుష పదజాలాన్ని వాడారు. సంస్కారం మరచి టీడీపీ నాయకుల నోటి నుంచి వచ్చిన బూతు పురాణం విన్న సభలోని కొంతమంది ఆ పార్టీ శ్రేణులు, మహిళలు సైతం విస్తుపోయారు.

గంటా గాయబ్

పాత గాజువాక జంక్షన్‌లో బహిరంగ సభ అనంతరం బస్సు యాత్ర స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరం వద్దకు చేరుకుంది. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాత్రం ఆ శిబిరానికి వెళ్లకుండా గాజువాక నుంచే కారులో వెనక్కి వెళ్లిపోయారు.

నిరంతర అధ్యయనంతోనే జ్ఞాన సంపద



మాట్లాడుతున్న హెచ్‌పీసీఎల్ చైర్మన్ అండ్ ఎండీ పుష్పకుమార్ జోషి, తరగతుల ప్రారంభోత్సవానికి హాజరైన విద్యార్థులు

- విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ చైర్మన్ పుష్పకుమార్ జోషి పిలుపు
- ఐఐఎంవీ ఎంబీఏ, పీహెచ్‌డీ తరగతుల ప్రారంభం

ఏయూక్యాంపస్: విద్యార్థులు ప్రతిభా కాంతి పుంజాలుగా నిలవాలని హెచ్‌పీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పుష్పకుమార్ జోషి పిలుపునిచ్చారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ఎంబీఏ 9వ బ్యాచ్, పీహెచ్‌డీ 5వ బ్యాచ్ తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జీవితంలో ఒక ఉన్నత దశకు మీరు అడుగు పెట్టారని, రెండేళ్ల ఈ ప్రయాణం భవిష్యత్ జీవితాన్ని నిర్దేశిస్తుందన్నారు. ఐఎంవీలోని నాణ్యమైన బోధన సిబ్బంది విద్యార్థుల విజయాలను అపరిమితం చేస్తారనే నమ్మకం తనకుందన్నారు. తెలుసుకోవడం, అనువర్తించడం, వినియోగించడం అనే మూడు అంశాలు వ్యక్తి ప్రగతిని ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ప్రతీ విద్యార్థికి ఒక ప్రత్యేక సామర్థ్యం, నైపుణ్యం ఉంటుందని, దానిని వెలికితీసే ప్రయత్నం జరగాలన్నారు. శాస్త్ర అంశాలను లోతుగా అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. సరైన ప్రశ్నలు అడగటం చాలా అవసరమని, వినడంలో కొత్త జ్ఞానం అలవడుతుందన్నారు. ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ బాధ్యతాయుత ప్రవర్తన పెద్ద సంపదగా నిలుస్తుందన్నారు. ఆలోచనలు, చేతల్లో స్పష్టత కలిగి ఉండాలన్నారు. క్రమశిక్షణ, సానుకూల ఆలోచనలతో పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థిలో ప్రొఫెషనల్ స్కిల్స్ వృద్ధి చేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని, అదే సమయంలో సామాజిక నైపుణ్యాలను సైతం పెంపొందిస్తామన్నారు. అకడమిక్ ప్రగతి సాధించిన 2022–24 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార్య మిలన్ కుమార్, ఆచార్య బి.శ్రీరంగాచార్యులు, ఆచార్య ఎం.వి అనూరాధ ప్రసంగించారు.

70 శాతం ఇంజినీరింగ్ చదివిన వారే..

ఐఐఎంవీలో 2023–25 విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన వారిలో 70 శాతం మంది ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన వారు ఉండటం విశేషం. మేనేజ్‌మెంట్ విద్య చదివిన వారు 5 శాతం, సైన్స్ కోర్సులు చదివిన వారు 10 శాతం, ఆర్ట్స్ కోర్సుల వారు 4 శాతం, కామర్స్ వారు 11 శాతం మంది ఉన్నారు. మొత్తం 380 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందారు. వీరిలో 61 శాతం విద్యార్థులు, 39 శాతం విద్యార్థినులు ఉన్నారు. దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఐఐఎంవీని ఎంపిక చేసుకున్నారు. మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 68 మంది ప్రవేశాలు పొంది ప్రథమ స్థానంలో నిలవగా, మన రాష్ట్రం నుంచి 33 మంది ప్రవేశాలు సాధించి మూడవ స్థానంలో నిలిచింది. పీజీపీ కోర్సులో ప్రవేశం పొందిన వారిలో 47 శాతం మంది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో పని చేసిన వారు, ఇంజినీరింగ్–ఇండస్ట్రియల్ రంగంలో 19 శాతం మంది, బ్యాంకింగ్‌లో 5 శాతం, రిటైల్‌లో 2 శాతం, ఎఫ్ఎంసీజీ, టెలికం, ఫార్మా–హెల్త్ రంగాల్లో పనిచేసిన అనుభవం కలిగిన వారు ఒక్కో శాతం ఉండగా, ఇతర రంగాల్లో పనిచేసిన అనుభవం కలిగిన వారు 27 శాతం మంది ఉన్నారు.

- పీహెచ్‌డీ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరానికి ఏడుగురికి ప్రవేశాలు కల్పించారు. వీరిలో ముగ్గురు ఇంజినీరింగ్, ఇద్దరు ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, కామర్స్ రంగాల వారు ఒక్కరు చొప్పున ఉన్నారు. ప్రస్తుతం ప్రవేశాలు పొందిన వారిలో ఆరుగురు విద్యార్థులు ఉండగా, ఓ విద్యార్థిని ఉన్నారు. బిహార్, కర్నాటక, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి ఒక్కొక్కరు, మన రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రవేశాలు సాధించారు.

వర్షాల కోసం వరదపాయసం సేవ





పొర్లుబండపై నుంచి పాయసాన్ని జారవిడుస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) వైకుంఠవాసుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

- పొర్లుబండ పైనుంచి పాయసాన్ని జారవిడిచిన అర్చకులు

సింహాచలం: సింహగిరిపై వైకుంఠవాసుడి సన్నిధిలో మంగళవారం వరదపాయసం సేవ విశేషంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఏటా సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టపై కొలువుదీరిన వైకుతవాసుడి సన్నిధిలో పాయసం వండి, సమీపంలో ఉన్న పొర్లు బండపై నుంచి జారవిడుస్తుంటారు. దీనినే వరదపాయసం సేవగా అభివర్ణిస్తారు. దీనిలో భాగంగా మంగళవారం వరదపాయసం సేవని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, పంచకలశ ఆవాహనం, పంచకలశ స్నపనం, విశేష ఆరాధన నిర్వహించారు. విరాట్‌పర్వ పారాయణ పఠనాన్ని చేశారు. అనంతరం అక్కడే వండిన పాయసాన్ని స్వామికి నివేదన చేశారు. అనంతరం సమీపంలో ఉన్న పొర్లు బండపై పాయసాన్ని జారవిడిచారు. భక్తులు పొర్లు బండపై నుంచి జారే పాయసాన్ని తీసుకుని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, దశమంతుల రామలక్ష్మి, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.



ఆశాజనకంగా మత్స్యవేట

ప్రస్తుతం సముద్రంలో మత్స్య వేట ఆశాజనకంగా సాగుతోంది. ఈ నెల 15వ తేదీ నుంచి వేట తిరిగి మొదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కొమ్ముకోనం, టూనాతో పాటు రొయ్యలు, ఇతర చేపలు మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి. వీటి విక్రయాలతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ కళకళలాడుతోంది. అధిక ధరకు చేపలు, రొయ్యలు అమ్ముడుపోతుండటంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







లీజ్ అగ్రిమెంట్ పొడిగింపు



లీజ్ అగ్రిమెంట్ పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్(ఏఐఐఎల్ఎస్‌జీ) శానిటరీ ఇన్‌స్పెక్టర్ డిప్లమో, ఎగ్జిక్యూటివ్ డిప్లమో ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, డిప్లమో ఇన్ జీఐఎస్-రిమోట్ సెన్సింగ్ కోర్సులు నిర్వహిస్తోంది. కోర్సుల నిర్వహణతో పాటు రీజినల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల భవనంలో కొంత స్థలాన్ని ఏయూ కేటాయించింది. దీనికి సంబంధించిన లీజ్ అగ్రిమెంట్‌పై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏఐఐఎల్ఎస్‌జీ డైరెక్టర్ జనరల్ ఎ.ఎన్.శెట్టి సంతకాలు చేశారు. ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ బీరేంద్ర సింగ్ ఫర్త్యాల్, ఏయూ చీఫ్ ఇంజినీర్ ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

3న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక

మహారాణిపేట: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు పి.సుభాష్ జూలై 3న విశాఖ వస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 1.05 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. భోజనం తర్వాత హిందుస్థాన్ షిప్‌యార్డులో జరిగే ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరవుతారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. జూలై 4న ఉదయం 10 గంటలకు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎస్సీ ఉద్యోగులు, ఎస్సీ అసోసియేషన్ సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.45 గంటలకు విమానంలో ఢిల్లీ వెళతారు.

థ్యాంక్యూ సీఎం సార్

ముఖ్యమంత్రి చిత్రపటానికి న్యాయవాదుల క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

అల్లిపురం: వైఎస్సార్ లా నేస్తం ద్వారా యువ న్యాయవాదులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహాన్ని అందించారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ జి.మహేశ్వరరెడ్డి అన్నారు. కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు మూడేళ్ల పాటు నెలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించే పథకం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందన్నారు. వైఎస్సార్ లా నేస్తం పేరుతో జూనియర్ న్యాయవాదుల అకౌంట్లలోకి నిధులు జమ చేయడంతో మంగళవారం జిల్లా కోర్టు మెయిన్‌గేటు వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి న్యాయవాదులు క్షీరాభిషేకం నిర్వహించారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు బాజీ నాయుడు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు సన్నీయాదవ్, గాలి రామిరెడ్డి, వేణుగోపాలరావు, ఎస్.ఎస్.వాసు, పాకా సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరికి జైలు, జరిమానా

అల్లిపురం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ ఇద్దరికి రెండు రోజుల సాధారణ జైలు, వంద రూపాయల జరిమానా విధిస్తూ నగరంలో 2వ స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి టి.వెంకటరమణ మంగళవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఏసీపీ-2, రాజీవ్ తెలిపిన వివరాల ప్రకారం మల్కాపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన 11 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వారిలో పెదగంట్యాడ, క్రాంతినగర్‌కు చెందిన చింతల నాగేశ్వరరావు మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండుసార్లు పట్టుబడటంతో పై విధంగా తీర్పు చెప్పారు. పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు 12 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా పాత పెందుర్తి, రామాలయం వీధికి చెందిన ఆళ్ల కామేశ్వరరావు మద్యం సేవించి రెండుసార్లు పోలీసులకు పట్టుబడటంతో అతనికి 2 రోజుల జైలు, రూ.100 జరిమానా విధించారు.

వాహనచోదకులూ.. బహుపరాక్

గోపాలపట్నం: సస్పెండ్ అయిన డ్రైవింగ్ లైసెన్స్‌తో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సెక్షన్ 182(1) ప్రకారం సస్పెండ్ అయిన డ్రైవింగ్ లైసెన్స్‌తో వాహనాలు నడిపితే రూ.10వేల జరిమానాతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. మోటార్ వాహన చట్టం 1988 ప్రకారం లైసెన్స్ లేని వ్యక్తికి వాహనాన్ని నడపడానికి ఇస్తే.. యజమానికి కూడా రూ.5వేల జరిమానాతో పాటు మూడు నెలల జైలు శిక్ష లేదా రెండు శిక్షలు విధిస్తారని చెప్పారు.

లైంగికదాడి కేసులో యువకుడికి జైలు

విశాఖ లీగల్: యువతిపై లైంగిక దాడి చేసిన యువకుడికి యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి లాలం శ్రీధర్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్ మూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం కస్పా వీధికి చెందిన యాదగిరి గోవింద్ (24) 2017 ఆగస్టు 22వ తేదీకి ముందు అదే వీధికి చెందిన ఓ యువతి ఇంటికి తరచూ వెళ్లేవాడు. ఆమెను మభ్యపెట్టి, మాయ మాటలతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబరుచుకున్నాడు. ఆమె గర్భం దాల్చడంతో పెళ్లి చేసుకోవాలని కోరగా, నిందితుడు తిరస్కరించాడు. డబ్బు ఆశ చూపి తనను మర్చిపోవాలని, వదిలించుకునే ప్రయత్నం చేశాడు. కులం పేరుతో దారుణంగా దూషించాడు. దీంతో బాధితురాలు ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో కశింకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును దర్యాప్తు చేసి కశింకోట సీఐ నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. కులం పేరుతో దూషించినందుకు ఆరు నెలల జైలు, 500 రూపాయలు జరిమానా చెల్లించాలని తమ తీర్పులో స్పష్టం చేశారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని పేర్కొన్నారు.

ఏయూ విద్యార్థులకు సెలవులు కొనసాగింపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల విద్యార్థులకు వేసవి సెలవులను జూలై 9వ తేదీ వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. జూలై 10వ తేదీ నుంచి తరగతులు పునఃప్రారంభం అవుతాయన్నారు. వసతి గృహాల్లో జరుగుతున్న సివిల్, ఎలక్ట్రికల్ మరమ్మతుల కారణంగా సెలవులను పొడిగించినట్లు పేర్కొన్నారు. బోధన సిబ్బందికి సెలవుల్లో పొడిగింపు లేదని స్పష్టం చేశారు. గతంలో సూచించిన విధంగా బోధన సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు.

చేనేత కళాకారులకు చేయూతనివ్వండి

దాబాగార్డెన్స్: చేతి వృత్తి, చేనేత కళాకారులకు ప్రజలు చేయూతనివ్వాలని నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్ కోరారు. నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో నాబార్డు సహకారంతో నేస్తం సంస్థ ఏర్పాటు చేసిన చేతి వృత్తులు, చేనేత ప్రదర్శనను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన, విక్రయాలు జూలై 12వ తేదీ వరకు ఉంటాయన్నారు. ప్రజలు చేతి వృత్తి ఉత్పత్తులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు చేయూత ఇచ్చినట్టు అవుతుందన్నారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన చేతివృత్తి, చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాదరావు, ఏడీఎం సమంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేశారు. బాలుర విభాగంలో 11 మంది, బాలికల విభాగంలో 13 మందిని జిల్లా జట్లకు ఎంపిక జరిగింది. గ్రూప్-1 బాలుర విభాగంలో కె.కార్తీక్, సాహిల్ కౌశిక్, ఎస్.జితేష్, బి.అభిరామ్, వేదాంత్‌కుమార్, గణేష్‌చక్రధర్ ఎంపిక కాగా బాలికల విభాగంలో మానసమనోజ్, నిస్తా పాటిల్ ఎంపికయ్యారు. గ్రూప్-2 బాలుర విభాగంలో ఎం.శ్రేయాస్, వి.ప్రణయ్, లలిత్‌రామ్ చరణ్ ఎంపిక కాగా బాలికల్లో దీపాన్షు, బి.ఇషిత, రుత్‌వాన్ ఎంపికయ్యారు. గ్రూప్-3 బాలురలో సూర్యశ్రీతేష్, ఇషాన్ ఎంపిక కాగా బాలికల్లో రేవా చౌహాన్, యశ్విదత్త, ధృతిశుబాగ, సమరగుప్త, దియ, మాన్విసింగ్, ఇషిత, విద్యశ్రీ ఎంపికయ్యారు. ఈ ఎంపిక పోటీలు ఎంవీపీకాలనీలోని ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా స్టేడియంలో జరిగాయి. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఆయా అంశాల్లో చక్కటి ప్రతిభ చూపిన వీరంతా గుంటూరు జిల్లా నరసరావుపేటలో జూలై 8,9వ తేదీల్లో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నారని జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్‌వెంకటరామ్ తెలిపారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, టీపీకేటీ(టక్‌జీట్) ఇంటర్నేషనల్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్(ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జర్మనీలో స్టాఫ్ నర్సులుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. అభ్యర్థులు 20-35 ఏళ్ల వయసు కలిగి రెండేళ్ల పాటు సాధారణ ఆస్పత్రిలో పని చేసిన అనుభవం కలిగి ఉండాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జర్మనీ భాషను నేర్చుకోవడానికి ఆసక్తి కలిగి ఉండాలన్నారు. విజయవాడ కేఎల్ విశ్వ విద్యాలయంలో రెండు నెలల పాటు బీ1 స్థాయి జర్మన్ భాష ఉచిత శిక్షణకు హాజరు కావాలి. రెజ్యూమెతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు, అనుభవ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.

శిక్షణ షెడ్యూల్ ఇదీ..

జూలై 1వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి. వారానికి 48 గంటలు చొప్పున రెండు నెలల పాటు జర్మనీ భాషపై శిక్షణ ఉంటుంది. విద్యార్థులు డేస్కాలర్ లేదా హాస్టల్‌లో చేరవచ్చు. హాస్టల్ ఫీజు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 30వ తేదీ లోగా www.apssdc.in/home/online Program Registration లింక్ తెరిచి దరఖాస్తు చేసుకోవాలి. సర్టిఫికెట్లు, రెజ్యూమెను helpline@apssdc.in మెయిల్ ఐడీకి లేదా 99888 53335కు పంపించవచ్చు. మరిన్ని వివరాలకు 98856 94676, 89850 79791లో సంప్రదించవచ్చు.